# ఇ-పీడీఎస్‌తో అక్రమాలకు చెక్

- లోపాలను సరిదిద్దేందుకే నూతన విధానం
- నిత్యావసరాల సక్రమ పంపిణే లక్ష్యం
- వచ్చే నెల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు
- పౌర సరఫరాల కార్పొరేషన్ ఎండీ రవిబాబు



ఇ-పీడీఎస్‌తో అక్రమాలకు చెక్

**ఒంగోలునగరం:** పేదలకు నిత్యావసరాలను సక్రమంగా అందించడమే లక్ష్యంగా వచ్చేనెల నుంచి ఇ-పీడీఎస్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ ఎండీ జి.రవిబాబు అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం జరిగిన అధికారులు, రేషన్ డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 29 వేల రేషన్‌షాపులుండగా వాటిలో 6వేల దుకాణాల్లో వచ్చే నెలనుంచి ఇ-పీడీఎస్ విధానాన్ని అమలు చేయనున్నామన్నారు. ప్రస్తుతం ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో ఈ విధానం అమలు జరుగుతోందన్నారు. మన రాష్ట్రంలోని పశ్చిమ గోదావరి జిల్లాలో ఈ విధానం అమల్లో ఉందని తెలిపారు. జిల్లాలో 220 దుకాణాల్లో ఇ-పీడీఎస్ విధానాన్ని తొలి విడతగా అమలు చేయనున్నామన్నారు. ఈ విధానం వల్ల అక్రమాలకు చెక్ పెట్టడమే కాకుండా కార్డుదారులకు సక్రమంగా సరుకులు అందుతాయన్నారు. ఎంఎల్‌ఎల్ పాయింట్ల నుంచి సరుకులు రేషన్ దుకాణాలకు చేరేవరకు నిఘా ఉంటుందన్నారు. ఎఫ్‌సీఐ గోదాముల నుంచి ఎంఎల్‌స్ పాయింట్లకు, ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి రేషన్ దుకాణాలకు తక్కువ తూకంతో బియ్యం వచ్చే అవకాశం కూడా ఉండదన్నారు. ఎంఎల్‌ఎస్ పాయింట్లన్నింటినీ పూర్తిస్థాయిలో కంప్యూటరీకరిస్తున్నామన్నారు. ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి సరుకులను తీసుకుపోయే వాహనాలను జియో ట్యాగింగ్ సిస్టం ద్వారా అనుసంధానించి సరుకులు పక్క దారి పట్టకుండా చూస్తామన్నారు. ఇ-పీడీఎస్ అమలుకు ప్రతి రేషన్‌దుకాణంలో బయోమెట్రిక్ మిషన్, ఎలక్ట్రానిక్ తూకం పరికరం ఉంటాయన్నారు. ఎలక్ట్రానిక్ మిషన్‌లో తూకం సక్రమంగా ఉంటేనే ఇ-పాస్ మిషన్ ద్వారా కార్డుదారుడికి సరుకులిచ్చి, బిల్లు ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఏ స్టేజీలో కూడా అక్రమాలకు తావులేకుండా ఈ విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. కార్డులో పేరున్న కుటుంబసభ్యుల్లో ఎవరైనా వచ్చి సరుకులు తీసుకుపోవచ్చన్నారు. ఒకే సారి కాకుండా విడతల వారీగా కూడా సరు కు లు తీసుకుపోయే అవకాశం ఉందన్నారు. డీలర్లు ఇక నుంచి కాకి లెక్కలు చెప్పేందుకు వీలుండదన్నారు. రేషన్ డీలర్లకు కూడా కమీషన్ పెంచి ప్రతినెలా రూ.6 వేల నుంచి రూ.10 వేల దాకా ఆదాయం వచ్చే అవకాశాలను పరిశీలిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఒక్కోవ్యక్తికి నాలుగు కిలోల బియ్యాన్నే ఇస్తున్నామని, ఏప్రిల్ నుంచి రేషన్ కార్డులోని ప్రతి వ్యక్తికీ 5 కిలోల చొప్పున బియ్యాన్ని ఇస్తామని అన్నారు.

### జాయింట్ కలెక్టర్ మండిపాటు

జాయింట్ కలెక్టర్ హరిజవహర్‌లాల్ అధికారులపై మండిపడ్డారు. పౌరసరఫరాలశాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్, పౌరసరఫరాల శాఖ అధికారులు పనితీరు మార్చుకోవాలన్నారు. జిల్లాలోని 950 రేషన్ దుకాణాలకు ఇంతవరకు సరుకులు చేరలేదని, ఈనెలలో ఇంకెప్పుడు సరుకులు పంపిణీ చేస్తారని ప్రశ్నించారు. సరుకులను ఆలస్యంగా దుకాణాలకు చేర్చుతూ మనమే అక్రమాలకు తావిచ్చేం దుకు దోహదపడుతున్నామని అన్నారు. జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి వెంకటే శ్వర్లుపై కూడా జేసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. "మూడు సమావేశాల ఏర్పాటుకు సంబం ధించి ఫైలు నడపాలని చెప్పా, ఇంతవరకు ఆఫైలు ఎక్కడుందో తెలియదు. అడిగితే అదిగో ఇదిగో అని చెబుతున్నారు. మీ పనితీరే బాగులేదు" అంటూ మండిపడ్డారు. ఇది ప్రథమ హెచ్చరికని, ఈసారి కఠినంగా వ్యవ హరిస్తానని హెచ్చరించారు. మనం తనిఖీ లు చేస్తూనే ఉన్నాం. బియ్యం దారిమళ్లి పోతూనే ఉన్నాయి అంటూ అసహనం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో డీఎస్ ఎ.వెంకటేశ్వర్లు, ఎన్‌ఐసీ ఏవో మోహనకృష్ణ, డీలర్ల సంఘం నాయకులు కూరపాటి సుబ్బారావు, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.




VISIONTEK GL-11